క్లుప్తంగా

రక్తదానం



రోగి కుటుంబ సభ్యులకు రక్తం అందిస్తున్న పృథ్వి, ఇల్తమాష్

విజయనగరం/విజయనగరం ఫోర్ట్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు ఓ యువకుడు. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఊపిరితిత్తుల సమస్యతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు అత్యవసరంగా ఏబీ నెగిటివ్ రక్తం అవసరమని వైద్యులు చెప్పడంతో, కుటుంబ సభ్యులు విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తమాస్‌ను ఆశ్రయించారు. దీంతో ఇల్తమాష్ అభ్యర్థన మేరకు యూత్ ఫౌండేషన్ సభ్యుడు పృథ్వి స్థానిక ఎన్‌ఎమ్‌ఎస్ బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి శుక్రవారం రక్తదానం చేశారు.

గడువులోగా పన్నులు చెల్లించాలి

నెల్లిమర్ల: నగర ప్రజలు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి, ఆస్తి, కుళాయి పన్నులు ఈ నెల 31లోగా చెల్లించాలని కమిషనర్ పి. బాలాజీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపులకు నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లోని అన్ని సచివాలయాల్లోనూ ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గడువులోగా చెల్లించకుంటే 24 శాతం అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ



గోదాం తాళాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ సమీపంలో నున్న ఈవీఎం గోదాంలను కలెక్టర్ ఎ.సూర్యకుమారి శుక్రవారం తనిఖీ చేశారు. గోదాం షట్టర్లకు వేసిన తాళాలు, సీళ్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి, నిత్యం అప్రమత్తంగా ఉండాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్వో ఎం. గణపతిరావు, తహసీల్దార్ కేవీ రమణరాజు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నీలకంఠరావు, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



రాజబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గరికిపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుంటమాని రాజబాబుతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరావును ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ వారి స్వగృహాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట అంబళ్ల శ్రీరాములనాయుడు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సమావేశం రేపు

విజయనగరం లీగల్: వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సర్వసభ్య సమావేశం ఈ నెల 5న విశాఖలో నిర్వహించనున్నట్లు విజయనగరం లీగల్ సెల్ అధ్యక్షుడు కె.నిరంజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార క్షత్రియ కల్యాణ మంటపంలో ఆదివారం ఉదయం జరగనున్న సమావేశానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి, పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కమిటీ అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. సభ్యులందరు సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు.

పిల్లలను తల్లికి దూరం చేయొద్దు..

విజయనగరం ఫోర్ట్: పిల్లలను తల్లికి దూరం చేయవద్దని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. భార్యను ఇంటిలో నిర్బంధించి ఇటీవల వార్తల్లోకెక్కిన కంటోన్మెంట్‌లోని న్యాయవాది గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటిలో ఉన్న పిల్లలు, న్యాయవాది తల్లితో మాట్లాడారు. తల్లిదండ్రుల సంరక్షణలోనే పిల్లలు ఉండడం మంచిదన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షురాలు జి.హిమబిందు, సభ్యులు భవానీ, సుధారాణి, బాలల సంరక్ష విభాగం అధికారి అల్లు సత్యనారాయణ, యాళ్ల నాగరాజు, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్యకు పరిష్కారం!

- డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు చర్యలు
- బయోమైనింగ్ పద్ధతిలో 2.06 లక్షల టన్నుల చెత్తకు కలగనున్నమోక్షం
- చెత్తను తరలించేందుకు రూ. 15 కోట్లకు పైగా వ్యయంతో ఒప్పందం



గుణుపూరుపేట డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త కుప్పలు

విజయనగరం: నగరంలో సేకరించిన చెత్తను నిల్వ చేసే గుణుపూరుపేట డంపింగ్‌యార్డ్‌కు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. లక్షల టన్నుల్లో పేరుకుపోయిన చెత్త కొండలను బయోమైనింగ్ పద్ధతిలో తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. సేకరించిన చెత్తా చెదారమంతా ఏళ్ల తరబడి డంపింగ్ యార్డుల్లో పనికి రాని చెత్తగా పేరుకుపోతోంది. డంపింగ్ యార్డులన్నీ నగరానికి శివారున ఉండడంతో ఆ ప్రాంతాల్లో నివాసం ఉండే వారికి గాలి, వర్షాల సమయంలో దుర్వాసనతో ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే అంటురోగాలతో కూడా సహవాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో తమను అంటురోగాల నుంచి కాపాడాలని గుణుపూరుపేట వాసులు పలుమార్లు అధికారులను కోరిన సందర్భాలున్నాయి. ఈ వ్యవహారంలో అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టినా సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదు. ఈ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా అమృత్ పథకం కింద కొనసాగుతున్న డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ క్రమంలో 15వ ఆర్థిక సంఘ నిధులతో టెంటర్లను కూడా పిలిచింది. ఈ చెత్త తొలగింపునకు స్థానిక సంస్థల నిధులు 40 శాతం, రాష్ట్ర నిధులు 22 శాతం, కేంద్ర ప్రభుత్వం 38 శాతం నిధులను వెచ్చిస్తోంది. అమృత్ పథకం కింద ఎంపికైన నగరాల్లో మాత్రమే చెత్తకొండలను తొలగిస్తారు.

కార్పొరేషన్ పరిధిలో ఇదీ పరిస్థితి

జిల్లా కేంద్రమైన విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ ప్రక్రియను ప్రారంభిస్తున్నారు. 50 డివిజన్లలో విస్తరించిన విజయనగరంలో ప్రతి రోజూ 120 మెట్రిక్ టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇలా సేకరించిన చెత్తను ప్రతిరోజూ నగరానికి 9 కిలోమీటర్ల దూరంలో డెంకాడ మండలం గుణుపూరుపేట సమీపాన గల డంపింగ్‌యార్డుకు తరలిస్తుంటారు. ఇలా కొనేళ్లుగా తరలించిన చెత్త అధికారిక లెక్కల ప్రకారం 22 ఎకరాల విస్తీర్ణంలో 2.25 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని అంచనా. ఈ చెత్తను బయోమైనింగ్ పద్ధతిలో తరలించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర స్థాయిలో టెండర్లు ఆహ్వానించగా.. గుంటూరుకు చెందిన ఓ సంస్థ టెండర్‌ను దక్కించుకుంది. సుమారు రూ.15 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేయగా.... టన్నుకు రూ.740 చెల్లించనున్నారు.

ప్రజలకు కలగనున్న ఉపశమనం

డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించడం ద్వారా పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామీణ ప్రజలకు ఉపశమనం కలగనుంది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్తతో గుణుపూరుపేట, కొత్త ముంగినాపల్లి, ముంగినాపల్లి, డి.కొల్లాం గ్రామాలకు చెందిన వారు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా భూగర్భజలాలు కలుషితమై రోగాల బారిన పడుతున్నారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో త్వరలో వారి కష్టాలకు మోక్షం కలగనుంది.

చర్యలు తీసుకుంటున్నాం..



గుణుపూరుపేట డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నాం. రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో టెండర్లు ఖరారయ్యాయి. కొన్నేళ్లుగా పేరుకుపోయిన 2.25 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ పద్ధతిలో తొలగిస్తాం.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

అమ్మవార్ల జాతరకు ఏర్పాట్లు



కనకదుర్గమ్మ తల్లి ఆలయ ప్రధాన ద్వారం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాటాకుల పందిరి

భోగాపురం: మండలంలోని పోలిపల్లి, భోగాపురం గ్రామాల్లో జరగనున్న పైడితల్లి, కనకదుర్గమ్మతల్లి జాతర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 6, 7, 8 తేదీల్లో అమ్మవార్ల జాతరలను నిర్వహించనున్నారు. జాతరలకు ఇంకా మూడు రోజులు మాత్రమే గడువు ఉండడంతో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. మూడు రోజుల జాతరలలో భాగంగా మంగళ, బుధ వారాల్లో లక్షల సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. జాతరలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలిపల్లి ఆలయ కమిటీ చైర్మన్ కర్రోతు పైడిరాజు, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ పతివాడ రామకృష్ణ, కమిటీ సభ్యులు.. భోగాపురంలో కనకదుర్గమ్మతల్లి ఆలయ ధర్మకర్త కందుల రఘుబాబు, కమిటీ సభ్యులు కొమ్మూరు సుభోషణరావు, బుల్లయ్య, ఆళ్ల ఉదయబాబు, విశ్వేశ్వరరావు, తదితరులు ఏర్పాట్లు చేశారు. ఆలయాల ప్రధాన ముఖ ద్వారం వద్ద తాటాకుల పందిర్లను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజం



మాట్లాడుతున్న ఏపీసీఎన్‌ఎఫ్ రిసోర్స్‌పర్సన్ దుర్గ

పూసపాటిరేగ: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఏపీసీఎన్‌ఎఫ్ రిసోర్స్‌పర్సన్ పి. దుర్గ అన్నారు. మండలంలోని పసపాంలో ఉపాధి హామీ వేతనదారులకు నవధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల నాణ్యమైన దిగుబడి వస్తుందని, తద్వారా అనారోగ్యాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బందితో పాటు వేతనదారులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లోనూ రాణిస్తున్నారు



డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిని సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులకు సమానంగా రాణిస్తున్నారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇన్నర్‌వీల్ క్లబ్ సమాజహితం కోసం చేస్తున్న కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదిగేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

డెంకాడ: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్యాధికారి ఎస్‌వీ రమణికుమారి అన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పినతాడివాడలో శుక్రవారం ఆమె పర్యటించి కాలువలను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ భవానీ, సీహెచ్‌ఓ యాశయ్య, సూపర్‌వైజర్ గురుభక్తులు, పంచాయతీ కార్యదర్శి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



పినతాడివాడలో మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రమణికుమారి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని ధర్మపురి సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎస్‌ఈ పి. నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మపురి, ప్రదీప్‌నగర్, వసంతవిహార్, పద్మావతినగర్, ఎస్‌వీఎన్ నగర్, బియ్యాలపేట, నోబుల్‌నగర్, కొత్త ధర్మపురి, కమలనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భోగాపురంలో..

భోగాపురం: మండలంలోని ముంజేరు, పిట్టపేట, సబ్బన్నపేట, కొయ్యపేట, అప్పన్నపేట, కారిగొల్లపేట, ఎ. రావివలస, గూడెపువలస, దల్లిపేట, బైరెడ్డిపాలెం, ఉప్పాడపేట, రెడ్డికంచేరు గ్రామాల పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జ్ఞానేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హంస వాహనంపై విహరించిన శ్రీనివాసుడు



పుష్కరిణిలో హంస వాహనంపై విహరిస్తున్న వేంకటేశ్వరస్వామి

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్దనున్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న పుష్కరిణిలో అలమేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి హంస వాహనంపై శుక్రవారం సాయంత్రం విహరించారు. భక్తులు శ్రీనివాసుని తెప్పోత్సవాన్ని కనులారా తిలకించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు భీష్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది.

సుధాకర్‌ను గెలిపించండి..

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా కోలగట్ల ప్రచారం



నెల్లిమర్ల: ప్రచారం చేస్తున్న చిక్కాల, తదితరులు



విజయనగరం: ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు



భోగాపురం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి



నెల్లిమర్ల రూరల్: అలుగోలులో పట్టభద్రుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు



నెల్లిమర్ల: ప్రచారం చేస్తున్న నాయకులు



నెల్లిమర్ల రూరల్: జోగిరాజుపేటలో అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ సుధారాణి, తదితరులు



డెంకాడ: సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని ఏపీ శాసన సభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. ఈ మేరకు సుధాకర్‌కు మద్దతుగా నగరంలోని 43వ డివిజన్ ఉడా కాలనీ ఫేజ్–2లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సుధాకర్‌ను గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన చూసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజుకు మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని కోరారు. విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. నాడు – నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో సీతంరాజును గెలిపించడం ద్వారా మరింత అభివృద్ధి సాధించవచ్చన్నారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల తమన్నశెట్టి, డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రజారంజక పాలన సాగిస్తుంటే, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి సత్యవతి, డివిజన్ ఇన్‌చార్జ్ వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో..

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్‌చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు, తదితరులు చేపట్టారు. పట్టభద్రులను నేరుగా కలిసి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటువేయాలని కోరారు. ప్రచారంలో పార్టీ జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, వార్డు కన్వీనర్ పైల మురళి, తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటు..

వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు కోరారు. నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలో సుధాకర్ తరపున ప్రచారం నిర్వహించారు. మద్దిల వాసు, నల్లి శ్రీను, నారాయణమూర్తి, మాత సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం ..

భోగాపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఉప్పాడపేట పార్టీ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుని సైనికుల్లా పనిచేసి మన సత్తా చాటాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, పడాల భానుప్రకాష్, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు

నెల్లిమర్ల రూరల్: ఎమ్మెల్సీ బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ మద్దతుదారు సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు కోరారు. మండలంలోని అలుగోలు, గుషిణి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత, విద్యార్థుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పనలో భాగంగా పారిశ్రామిక దిగ్గజాలను విశాఖకు తీసుకువచ్చారని.. త్వరలో పారిశ్రామికాభివృద్ధిలో ఏపీ అగ్రగామిగా నిలుస్తుందనడంలో సందేహం లేదన్నారు. ఏపీ అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీకి పట్టభద్రులు అండగా నిలబడాలని.. ఈ క్రమంలో సీతంరాజును ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, నేతలు జమ్ము అప్పలనాయుడు, సత్తిబాబు, ఆల్తి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు పలకాలి

మంచి చేస్తున్న ప్రభుత్వానికి పట్టభద్రులు మద్దతు పలకాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు కోరారు. మండలంలోని జోగిరాజుపేటలో సీతంరాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అంబళ్ల శ్రీరాములనాయుడు, చనమళ్ల వెంకటరమణ, రేగాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రచారం...

డెంకాడ: సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మండలంలోని సింగవరం, నాతవలస, డెంకాడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు-నేలతల్లి బాగు

వేపాడ: నవధాన్యాలు సాగు చేసి భూమిలో కలియదున్నటం వల్ల భూమి సారవంతంగా తయారవుతుందని, పంటకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందుతాయని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ సన్యాసమ్మ అన్నా రు. చినగుడిపాలలో శుక్రవారం ఉపాధిహామీ వేతనదారులకు నవధాన్యాల సాగుపై అవగా హన కల్పించారు. ఎకరా పొలంలో 13 కేజీల పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయటం వల్ల 10 టన్నుల సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుందన్నారు. దీని వల్ల నేలలో జీవవైవిధ్యంతో పాటు నీటిని పట్టిఉంచే సామర్థ్యం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట పశువులకు మేతగా కూడా ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.రామునాయుడు, వీఏఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో సీతారామ ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామివారి కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. సర్పంచ్ బుద్దా చిన్నమ్మలు, అప్పలనాయుడు దంపతులు సీతమ్మవారికి పండ్లు, స్వీట్లు సారె వస్తువులను ఊరేగింపుగా తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య పండితులు సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్వామివారి కల్యాణం సందర్భంగా సోంపురం, ఎల్.కోట సీతారాంపురం మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

క్వారీ కార్మికుల ధర్నా

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం సమీపంలో గల దాడి భాస్కర్ మినరల్స్ క్వారీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారయణ డిమాండ్ చేశారు. క్వారీల్లో పనిచేస్తున్న సుమారు 150 మంది కార్మికులు శుక్రవారం ధర్నాకు దిగారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా క్వారీలో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్టాలను వర్తించకపోవడం దారుణమన్నారు. కార్మికుల డిమాండ్లు రెండు నెలల్లో నెరవేర్చాలని, లేనియడల ఉద్యమాన్ని తీవ్రతం చేస్తామని హెచ్చరించారు.